క్లుప్తంగా

30న మున్సిపల్ సమావేశం

పుంగనూరు: మున్సిపాలిటీ సాధారణ సమావేశం ఈనెల 30న సోమవారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్టు చైర్మన్ అలీమ్ బాషా తెలిపారు. వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై సమావేశంలో చర్చించనున్నామని, అధికారులు, సభ్యులందరూ హాజరు కావాలని కోరారు.

నేడు ద్రౌపదీ కల్యాణం

సదుం: మండలంలోని భట్టువారిపల్లెలో పెద్దిరెడ్డి భాస్కర్ రెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహాభారత యజ్ఞంలో భాగంగా శుక్రవారం ద్రౌపదీ కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమానికి తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి, పెద్దిరెడ్డి వేణుగోపాల్ రెడ్డి తదితరులు హాజరవుతారని చెప్పారు.

గుండెపోటుతో హెడ్ కానిస్టేబుల్ మృతి



చలపతి (ఫైల్)

బైరెడ్డిపల్లె: బైరెడ్డిపల్లె పోలీస్ స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న చలపతి(52) గురువారం గుండెపోటుకు గురై హఠాన్మరణం చెందారు. రెండు నెలలుగా ఇక్కడ ఎస్ఐ, ఏఎస్ఐలు లేకపోయినా సమర్థవంతంగా విధులు నిర్వర్తిస్తూ మన్ననలు పొందారు. ఆయన మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

పీఆర్‌లో బదిలీలు

చిత్తూరు కార్పొరేషన్: పంచాయతీరాజ్(పీఆర్)శాఖలో బదిలీలు జరిగాయి. డీఈలుగా చిత్తూరుకు నవీన్, పలమనేరుకు మహేష్, పూతలపట్టుకు అనితను నియమించారు. పీఐయూ విభాగం పూతలపట్టు డీఈగా నరసింహప్రసాద్‌ను వేశారు. జిల్లా గ్రామీణ నీటి సరఫరాశాఖ డీఈలుగా చిత్తూరుకు శ్రీనివాసులు, పూతలపట్టుకు రవికిరణ్, పలమనేరుకు స్టాలిన్, నగరికి శ్రీహరి, కార్వేటినగరానికి సతీష్‌ను నియమించారు. వీరు త్వరలో బాధ్యతలు స్వీకరిస్తారు.

28న కంటి వైద్యశిబిరం

పుంగనూరు: పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఈనెల 28న కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు సంఘ అధ్యక్షుడు చెంగారెడ్డి తెలిపారు. శంకర్‌నేత్రాలయ వైద్యులు రోగులను పరీక్షిస్తారని, కంటి సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నిత్యాన్నదానానికి కూరగాయలు విరాళం



కూరగాయలు అందజేస్తున్న సత్యన్న

కాణిపాకం: కాణిపాక శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయంలోని అన్నదాన ట్రస్ట్‌కు గురువారం పలమనేరుకు చెందిన సత్యన్న సుమారు 2 టన్నులు కలిగిన 12రకాల కూరగాయలను ఈవో గురుప్రసాద్ సమక్షంలో అందజేశారు. కార్యక్రమంలో అన్నదాన సూపరింటెండెంట్ బాలరంగస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

సహకార సంఘాల బలోపేతమే లక్ష్యం

- జిల్లా సహకార శాఖ అధికారి నాగపద్మిణి



సిబ్బందితో మాట్లాడుతున్న నాగపద్మిని


గుడిపాల: సహకార సంఘాల బలోపేతమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా సహకార శాఖ అధికారి నాగపద్మిణి అన్నారు. గురువారం గుడిపాల సహకార సంఘాన్ని ఆమె తనిఖీ చేశారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. రైతులకు సంబంధించి వ్యవసాయ రుణాలు, బంగారు రుణాలు ఎంత వరకు ఇచ్చారు? రికవరీలు ఎలా ఉన్నాయి? అనే వాటిపై ఆరా తీశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, స్థానిక సహకార సంఘంతోపాటు అన్ని సహకార సంఘాలను కంప్యూటరీకరణ చేస్తున్నట్టు చెప్పారు. ఇకపై సహకార సంఘంలో ప్రతి ఒక్కటి ఆన్‌లైన్ విధానం ఉంటుందన్నారు. సహకార సంఘంలో రూ.300 కట్టి షేర్ హోల్డర్ కలిగిన రైతులందరూ పాస్‌బుక్ జెరాక్స్, ఆధార్ కార్డ్, ఫోన్ నంబర్‌తో వచ్చి ఆన్‌లైన్ చేసుకోవాలని కోరారు. ఈ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. పూర్తి చేయాలని వారికి తెలియజేశారు. ఆ తర్వాత కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా సహకార ఆడిట్ అధికారి బ్రహ్మానందరెడ్డి, డివిజనల్ కో–ఆపరేటివ్ ఆఫీసర్ వనజ, డీసీఓ సూపరింటెండెంట్ బాలాజి పవార్, సీఈఓ పట్టాభి, సిబ్బంది సెల్వం, జితేంద్ర, జయరాజ్ పాల్గొన్నారు.

సరిహద్దు సమస్యతో
అభివృద్ధికి గ్రహణం



ఒకే వీధిలో సగం వరకే వేసిన సీసీ రోడ్డు, వదిలి పెట్టిన స్థలం గంగవరం పంచాయతీకి పరిధి

- మున్సిపాలిటీ, పంచాయతీకి మధ్య నలుగుతున్న జనం
- దశాబ్ద కాలంగా బోయవీధిలో తెగని సమస్య
- ఓట్లు అక్కడ..అభివృద్ధి ఇక్కడ అంటున్న వైనం



పలమనేరు సరిహద్దులు చూపే మ్యాప్

పలమనేరు: పట్టణంలోని రొంటకుంట్ల రోడ్డు వద్ద బోయవీధికి సంబంధించి సరిహద్దు సమస్య అభివృద్ధికి అవరోధంగా మారింది. మున్సిపాలిటీ అభివృద్ధి పనులు తమ ప్రాంతంలో చేయడం లేదంటూ ఈప్రాంత వాసులు వాపోతున్నారు. పన్నులు మాత్రం గంగవరం పంచాయతీకి..అభివృద్ధి పనులు మాత్రం మున్సిపాలిటీ చేయాలా? అని మున్సిపల్ అధికారుల వాదన. అటు పంచాయతీ, ఇటు మున్సిపాలిటీ సరిహద్దు సమస్య ఈ ప్రాంతం అభివృద్ధికి గ్రహణం పట్టింది.

సమస్య ఏమిటంటే..!

పలమనేరు బోయవీధి ప్రాంతం మున్సిపాలిటీకి సరిహద్దుగా ఉంది. ఇక్కడ ఉన్నరాజకాల్వ అటు గంగవరం రెవెన్యూకి ఇటు పలమనేరు పట్టణ రెవెన్యూలను విడదీస్తుంది. అయితే పట్టణం మున్సిపాలిటీగా రూపాంతరం చెందే నాటికే రెండు రెవెన్యూల మధ్య ఇంటి నిర్మాణాలు జరిగాయి. ప్రస్తుతం సమస్యాత్మకంగా ఉన్న ఈ ప్రాంతంలో దాదాపు వందదాకా కుటుంబాలు కాపురముంటున్నాయి. ఈ కుటుంబాలు పట్టణంలోనే ఓటు హక్కును కలిగి ఉన్నాయి. రేషన్‌కార్డులు ఇక్కడే ఉన్నాయి. కరెంటు బిల్లులు పలమనేరుకే ఉన్నాయి. కానీ ఇంటిపన్ను మాత్రం గంగవరం పంచాయతీకి చెల్లిస్తున్నారు. ఫలితంగా మున్సిపాలిటీలో జరిగే మౌలిక సదుపాయాలు సరిహద్దుల మేరకే సాగుతోంది. కొన్ని వీధులో సీసీ రోడ్లను సైతం సగానికి వేసి వదిలేశారు. ఎందుకంటే ఆ వీధిలో అటువైపు గంగవరం పరిధిగా ఉంది. ఇక్కడ ఓ నీళ్ల ట్యాంకును మున్సిపల్ అధికారులు నిర్మించారు. అయితే దానికి సంబంధించిన మోటారు గంగవరం రెవెన్యూలో ఉంది. నీటి సరఫరా విషయంలోనూ సమస్యలు తప్పడం లేదు.

మున్సిపాలిటీ విస్తరణ ఆలస్యమే కారణం

గతంలో మున్సిపల్ కమిషనర్‌గా వెంకటేశ్వర్లు ఉన్నప్పుడు ఈ సమస్యను పరిష్కారానికి కృషి చేశారు.మున్సిపాలిటీ అటు గంగవరం మండల కేంద్రం వరకూ, ఇటు టీఎస్ వడ్డూరు దాకా పడమర క్యాటిల్‌ఫామ్ వరకు విస్తరించడానికి డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌కు ప్రతిపాదనలు పంపారు. దీనిపై ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు సైతం వచ్చాయి. ఈ పనులు చేసి ఉన్నపక్షంలో సమస్యకు పరిష్కారం లభించేది. కానీ రాజకీయ కారణాలతో ఇవి కాస్తా అటకెక్కాయి. ఈ విషయంపై అవగాహన కలిగిన ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అయినా దీనిపై చొరవచూపాలని అక్కడి ప్రజలు కోరుతున్నారు.



మున్సిపాలిటీ, పంచాయతీకి మధ్య సరిహద్దుగా ఉన్న రాజకాలువ

చాలా ఇబ్బందులు పడుతున్నాం



అటు పంచాయతీ, ఇటు మున్సిపాలిటీల మధ్య ఇల్లు కట్టుకున్నందుకు చాలా ఇబ్బందులు పడుతున్నాం. మున్సిపాలిటీ అభివృద్ధి పనులు ఇక్కడ చేయడం లేదు. పట్టణంలోనే ఓటు వేస్తున్నా లెక్కల్లో మాత్రం గంగవరం పంచాయతీవాసులుగా ఉన్నాం. మా సమస్యను పరిష్కరించాలని అధికారులకు అర్జీలిస్తూనే ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.

–సనావుల్లా, బోయవీధి ప్రాంత వాసి

మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు



ఈ సమస్యను పరిష్కరించాలని పలమనేరు పరిరక్షణ సమితి తరపున మున్సిపల్ అధికారులకు విన్నవించాం. ముఖ్యంగా రాజకాలువ అర్థంతరంగా ఆగింది. పట్టణంలోని డ్రైనేజీ మొత్తం ఈ ప్రాంతంలోకి చేరుతోంది. గంగవరం పంచాయతీవారేమో దీనిపై మున్సిపాలిటీ చర్యలు తీసుకోవాలంటారు. పన్నులు అక్కడ కడితే మేమెందుకు పట్టించుకోవాలని మున్సిపల్ అధికారులు అంటున్నారు. ఈ సమస్యను ఎమ్మెల్యే పరిష్కరించాలని కోరుతున్నా.

–నరసింహులు, పీపీఎస్ కార్యదర్శి

ప్రతిభ వెలికితీతకే చెకుముకి పోటీలు



చెకుముకి టాలెంట్ టెస్ట్ రాస్తున్న విద్యార్థులు

కల్లూరు(పులిచెర్ల): విద్యార్థుల్లో అంతర్గత నైపుణ్యాలను వెలికితీయడానికే చెకుముకి పోటీలను నిర్వహిస్తున్నట్లు కల్లూరు ఉన్నత పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం ప్రకాష్ తెలిపారు. గురువారం హైస్కూల్లో 8, 9, 10వ తరగతుల విద్యార్థులకు సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తునట్లు తెలిపారు. త్వరలో మండల స్థాయి పరీక్షలు అక్టోబర్‌లో నిర్వహిస్తారన్నారు.పర్యవేక్షకులుగా రాజేంద్ర, వెంకటసిద్ధులు తదితరులు పాల్గొన్నారు.

మురుగు కాలువ శుభ్రం



మురుగు కాలువలో పూడిక తీస్తున్న కార్మికులు

సాక్షి ఎఫెక్ట్..

రొంపిచెర్ల: రొంపిచెర్ల గ్రామ పంచాయతీ వారణాసివారిపల్లెలో పూడిపోయిన మురుగు కాలువను పంచాయతీ ఈఓ నాగరాజ శుభ్రం చేయించారు. గురువారం సాక్షి దిన పత్రికలో 'పూడిక తీయండి మహాప్రభో' శీర్షికతో ప్రచురించిన కథనంపై సర్పంచ్ ఇబ్రహీం ఖాన్, ఈఓ స్పందించారు. కూలీలతో పూడిక తీయించారు. పెద్దమల్లెల–రొంపిచెర్ల తారు రోడ్డు పనులు పూర్తి చేసిన తరువాత దెబ్బ తిన్న మురుగునీటి కాలువను పూర్తి స్థాయిలో నిర్మిస్తామని చెప్పారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి



విద్యార్థినులతో మాట్లాడుతున్న డీఈఓ దేవరాజు

సదుం: పదవ తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని డీఈఓ దేవరాజ్ ఆకాంక్షించారు. సదుం జెడ్పీ ఉన్నత పాఠశాలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పదవ తరగతి విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. మోడల్ ప్రశ్నపత్రం విధానంపై విద్యార్థులను ప్రశ్నించారు. మధ్యాహ్న భోజనం నాణ్యతపై ఆరా తీశారు. విద్య, మధ్యాహ్న భోజనం తదితర వాటిల్లో ఏదైనా సమస్య ఉంటే తనకు ఫోన్ చేసి తెలియజేయవచ్చని విద్యార్థులకు తన సెల్ నంబరు ఇచ్చారు.

విద్యార్థిని దత్తత

పాఠశాలలో 9వ తరగతి విద్యార్థిని అర్షియాను దత్తత తీసుకుంటున్నట్లు డీఈఓ ప్రకటించారు. ఆమె పదవ తరగతి విద్యాభ్యాసం పూర్తయ్యే వరకు విద్యావసరాలకు తాను అండగా ఉంటానని ప్రకటించారు.. కడపలో డీఈఓగా పని చేస్తున్న సమయంలో అక్కడా అర్షియా అనే విద్యార్థినిని దత్తత తీసుకున్నట్లు గుర్తు చేసుకున్నారు.

బియ్యం నాణ్యంగా లేదు

పాఠశాలలో వండుతున్న మధ్యాహ్న భోజనాన్ని డీఈఓ తనిఖీ చేశారు. మెనూ ప్రకారం వడ్డించాలని ఆదేశించారు. భోజనం రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రస్తుతం సరఫరా చేసిన బియ్యం నాణ్యంగా లేదని నిర్వాహకులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. విద్యార్థుల సైకిల్ ర్యాలీ ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్ఎం జయకుమార్ రెడ్డి, ఎంఈఓ–2 దామోదర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి క్రీడా పోటీలకు 25మంది ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

కల్లూరు(పులిచెర్ల): జిల్లాస్థాయి క్రీడా పోటీలకు కల్లూరు హైస్కూలు నుంచి 25మంది విద్యార్థులు ఎంపికయ్యారని వ్యాయామోపాధ్యాయులు రాజశేఖర్, విమలా విక్టోరియా, రుక్మాంగద తెలిపారు. సదుం గురుకుల పాఠశాలలో నిర్వహించిన ఖో–ఖో, వాలీబాల్, కబడ్డీ పోటీల్లో కల్లూరు విద్యార్థులు ప్రతిభ చాటి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. ఇన్‌చార్జి హెచ్ఎం ప్రకాష్, టీచర్లు పాల్గొన్నారు.

సతుల నడుమ ఘర్షణ

- దాడి చేసి ఇంటి నుంచి గెంటేశారు
- పోలీసులకు బాధితురాలి ఫిర్యాదు

పుంగనూరు: ఓ వ్యక్తి తాలూకు ఇద్దరి భార్యల నడుమ ఇంటి వివాదం తలెత్తి ఒక మహిళపై దాడి చేసిన సంఘటన గురువారం మండలంలోని ఉలవలదిన్నిలో చోటుచేసుకుంది. బాధితురాలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు..గ్రామంలో దివంగత సహదేవకు ఇద్దరు భార్యలు. వారిలో ఒకరు గంగులమ్మ, మరొకరు చౌడమ్మ(45). చౌడమ్మ నివసిస్తున్న ఇంటిని ఖాళీ చేయాలని గంగులమ్మ ఘర్షణకు దిగింది. గంగులమ్మ బంధువులైన మధు, రెడ్డెమ్మ, జయమ్మ కలసి చౌడమ్మ ఇంటిలోనికి చొరబడి, ఆమెపై దాడి చేసి, ఇంట్లోని వస్తువులను బయటకు పడేశారు. ఆపై ఆమెను ఇంట్లో నుంచి గెంటేశారు. చౌడమ్మ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాఠశాల స్థలాన్ని ఆక్రమిస్తే ఉపేక్షించం



జెడ్పీ హైస్కూల్ ప్రహరీని పరిశీలిస్తున్న వెంకట్రమణారెడ్డి, రాజేష్ తదితరులు

పుంగనూరు: మండలంలోని గూడూరుపల్లె జెడ్పీ హైస్కూల్‌లో ప్రహరీ కూల్చివేతపై సమగ్ర శిక్ష అభియాన్ జిల్లా కో–ఆర్డినేటర్ పెద్దిరెడ్డి వెంకట్రమణారెడ్డి గురువారం సాయంత్రం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ, పాఠశాలకు విరాళంగా అందిన భూమి తాలూకు రికార్డులు పరిశీలిస్తున్నామని, పాఠశాల ప్రాంగణాన్ని మొత్తం సర్వే చేస్తామన్నారు. ప్రహరీ స్థలం పాఠశాలకు సంబంధించినదని, దీనిని కాపాడుకుంటామన్నారు. పాఠశాలకు ఇచ్చిన స్థలాన్ని ఎవరు ఆక్రమించినా ఉపేక్షించే ప్రసక్తే లేదని ఆయన హెచ్చరించారు. ఇన్‌చార్జ్ హెచ్ఎం రాజేష్‌తో ప్రహరీ కూల్చివేత, ఇతర విషయాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఆధునిక పద్ధతులతో మంచి దిగుబడులు



బంగాళదుంప పంటను పరిశీలిస్తున్న ఉద్యానవనశాఖ అధికారులు, శాస్త్రవేత్తలు



శాంతిపురం: రాయితీ వివరాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు, నాయకులు

బైరెడ్డిపల్లె: సాగులో సస్యరక్షణకు తోడు అధికారుల సలహాలు పాటించి వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు పొందవచ్చని చిత్తూరు జిల్లా ఉద్యానవనశాఖాధికారి మధుసూదన్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానికంగా ఓ ఫంక్షన్ హాల్లో బైరెడ్డిపల్లె, వీ.కోట రైతులకు సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ, బంగాళదుంపలు సాగు చేయదలచిన రైతులు నాణ్యమైన విత్తన దుంపలను కొనుగోలు చేయాలన్నారు. విత్తన దుంపలు నాటే ముందు రెడోమిల్ గోల్డ్ లేదా కాపర్ హైడ్రాక్సైడ్ మందు ద్రావణంతో విత్తన శుద్ధి చేయాలన్నారు. బ్యాక్టీరియల్ విల్ట్ ఉన్న పొలంలో టమాట, వంగ, మిరప లాంటి పంటలు కాకుండా క్యాబేజీ, బీన్స్ లాంటి ఇతర పంటలు సాగు చేసుకోవాలని సూచించారు. బంగాళదుంప పంటను ఎక్కువగా ఆశించే ఆకుమాడు తెగులు నివారణకు మెటలాక్సిల్, మాంకోజెబ్ 2 గ్రాములు, సైమాక్సినిల్, మాంకోజెబ్ పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో కోలార్ శాస్త్రవేత్తలు మంజునాథరెడ్డి, ఆషా, బాలసుబ్రమణ్యం, ఉద్యానశాఖాధికారిణి లక్ష్మీ ప్రసూన, రైతులు పాల్గొన్నారు.

ధ్రువీకరించిన విత్తనాలనే వాడండి

శాంతిపురం: బంగాళాదుంప సాగు చేసే రైతులు ధ్రువీకరించిన, నాణ్యమైన విత్తనాలనే వినియోగించాలని కోలార్ కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) శాస్త్రవేత్తలు సూచించారు. గురువారం మండల వెలుగు సమాఖ్య కార్యాలయంలో జిల్లా ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో బంగాళాదుంప సాగు రైతుల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ మంజునాథరెడ్డి, డాక్టర్ ఆషా రైతులకు పలు అంశాలను వివరించారు. బ్యాక్టీరియా, విల్ట్ ప్రభావం ఉన్న పొలాల్లో క్యాబేజీ, బీన్స్ లాంటి వాటితో పంట మార్పిడి చేయాలని సూచించారు. వివిధ ఉద్యానవన పంటల్లో ప్రభుత్వం అందిస్తున్న రాయితీల వివరాలను తెలిపే పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన అధికారి డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, హార్టికల్చర్ ఆఫీసర్లు డింపుప్రియ, వింధ్య, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



బైరెడ్డిపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ రమాదేవి



రొంపిచెర్ల: చెంచెంరెడ్డిగారిపల్లెలో..

బైరెడ్డిపల్లె: తాజా కూరగాయలతో పాటు పౌష్టికాహారం తీసుకున్నప్పుడే ఆరోగ్యవంతంగా ఉంటారని సూపర్‌వైజర్ రమాదేవి అన్నారు. బైరెడ్డిపల్లె, బేలుపల్లె అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం గర్భవతులు, మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ చేతుల శుభ్రత, వ్యక్తిగత శుభ్రతను విధిగా పాటించాలన్నారు. చిరుధాన్యాలతో పాటు పండ్లు, గుడ్లు, ఆకుకూరలు బాగా తినాలన్నారు. వైద్యాధికారుల సలహాలను పాటించాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

రొంపిచెర్లలో..

రొంపిచెర్ల: గర్భుతులు, బాలింతలు క్రమం తప్పకుండా పోషకాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శిరీష అన్నారు. గురువారం చెంచెంరెడ్డిగారిపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార మాసోత్సవాలను నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, సంపూర్ణ ఆరోగ్యం కోసం అంగన్‌వాడీ కేంద్రాలలో అందజేసే పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గర్భవతులు, బాలింతలు ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, కోడిగుడ్లు, పాలు విధిగా తీసుకోవాలన్నారు. ప్రతి నెలా వైద్య పరీక్షలు చేసుకుని రక్తహీనతకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు అలివేలు, సంపత్‌కుమారి, లావణ్య, హసీనా, లక్ష్మి, జయమ్మ, దీప పాల్గొన్నారు.

రఘురామపై చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న మునిరత్నం

పలమనేరు: ఉండి ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజుపై చర్యలు తీసుకోవాలని పట్టణంలోని మానవ హక్కుల సంస్థ నిర్వాహకులు డిమాండ్ చేశారు. గురువారం పలమనేరులో సమావేశమై మాట్లాడారు. ప్రజాప్రతినిధిగా ఉంటూ డాక్టర్ అంబేడ్కర్ ఫ్లెక్సీని రఘురామ చించి అవమానించడం శోచనీయమని నిరసన వ్యక్తం చేశారు. అలాగే దళిత వైద్యుడు ఉమామహేశ్వర్‌రావుపై అక్కడి ఎమ్మెల్యే నానాజీ దాడి చేయడాన్ని ఖండించారు. కార్యక్రమంలో మునిరత్నం, ఆనంద, సాంబశివ, వినోద్, బాబు తదితరులు పాల్గొన్నారు.

పీఎఫ్ షెడ్యూల్ గడువు పొడిగించరూ!

- జెడ్పీ సీఈఓకు ఏపీటీఎఫ్ నాయకుల వినతి

చిత్తూరు కార్పొరేషన్: జెడ్పీ పరిధిలో పనిచేసే ఉద్యోగ, ఉపాధ్యాయులు పీఎఫ్ షెడ్యూల్ చేసుకోవడానికి అక్టోబర్ వరకు గడువు పొడిగించాలని ఏపీటీఎఫ్ నాయకులు కోరారు. గురువారం జెడ్పీ కార్యాలయంలో సీఈఓ రవికుమార్‌నాయుడును కలిసి సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ప్రస్తుతం 2020–2021 వరకు పీఎఫ్ ఖాతాల వివరాలు ఆన్‌లైన్ కనిపిస్తున్నాయని, 2020–2024 వరకు పీఎఫ్ షెడ్యూల్ పంపడానికి సెప్టెంబర్ 30 వరకు గడువు ఇచ్చారన్నారు. వాటిని ఇంకో నెల పొడిగిస్తే ఉద్యోగులకు అవకాశం కల్పించినట్లు అవుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు చిట్టిబాబు, చెంగల్రాయమందడి పాల్గొన్నారు.

నృత్య సమ్మోహనం







కాణిపాకం: ప్రత్యేక బ్రహ్మోత్సవాల్లో భాగంగా కాణిపాక శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలోని ఆస్థాన మండపంలో గురువారం ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను సమ్మోహితుల్ని చేశాయి. కూచిపూడి, భరతనాట్యం భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అలాగే హరికథా కాలక్షేపం, భక్తి గీతాలాపన కార్యక్రమాలు నిర్వహించారు. కళాకారులను అధికారులు సత్కరించి ప్రశంసాపత్రాలు అందజేశారు.



